# చట్టం క్షమించదు



కె. కె. మీనన్

భాస్కరం ఒళ్ళు జ్వరంకంటె తీవ్రమైన ప్రతీకార జ్వరంతో మండిపోతూంది.

అతని రక్తనాళాల్లోని నెత్తురు సలసలా కాగి బరామీటరులోని పాదరసంలా పైకి పాకి కళ్ళల్లో చేరుకుంటూంది. చీకటిలో అతని కళ్ళు చిరుతపులి కళ్ళల్లా మెరుస్తున్నాయి.

చిక్కని చీకటిలో అదిరే గుండెలతో బరువుగా అడుగులు వేసుకుంటూ నడుస్తున్నాడు.

అతని మనస్సు ప్రతీకారాన్ని వాంఛిస్తూంది.

ప్రతీకారం!

తన తండ్రి నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నందుకు ప్రతీకారం! తనను దిక్కులేని వాణ్ణిగా చేసి వీధిలోకి నెట్టినందుకు ప్రతీకారం.

తల్లి తనకు తెలీదు.

తల్లీ, తండ్రీ, దైవం — అన్నీ తానై, తనకోసం, తన అభివృద్ధికోసం

సర్వం త్యాగంచేసి, తన చదువుకోసం అప్పుడో పదీ, అప్పుడో పాతికా అప్పు పుచ్చుకున్నందుకు ప్రతిఫలంగా ఉన్న ఒక ఇంటినీ జగన్నాథం కాజేస్తే, తనకు ఏమీ మిగల్చలేకపోయానని కుమిలి ఆత్మహత్య చేసుకున్న తన ప్రత్యక్ష దైవం ఆత్మశాంతికోసం ... ప్రతీకారం.

తన తండ్రి మరణానికి కారకుడైన జగన్నాథంపై ... ప్రతీకారం!!

అతని శరీరం ఆవేశంతో ఊగిపోతూంది. పెదవులు కంపిస్తున్నాయి.

పళ్ళతో పెదాన్ని గట్టిగా నొక్కాడు. నెత్తురు చిమ్మి ఉప్పగా తగిలింది. అతనిలోని ఆవేశం ఆకాశం అంటింది. చేతిలోని కత్తిని చూసుకున్నాడు. చుక్కల కాంతిలో అది తళుక్కుమంది.

'ఒకే వేటుతో తల ఎగిరిపోవాలి. ఎన్నో తలలు మార్చిన జగన్నాథం తల ఎగిరిపోవాలి.'

ఊరవతల శ్మశానంలోంచి నక్కల బృందగానం వినబడుతూంది. తన తండ్రి కాష్ఠం ఇంకా రగులుతూనే ఉండాలి. అది ఆరకముందే జగన్నాథం కట్టెకూడా అక్కడకు చేరుకోవాలి!!

ఆలోచిస్తూనే జగన్నాథం మేడ చేరుకున్నాడు భాస్కరం. చుట్టూ కోట గోడ లాగ ఎత్తయిన ప్రహరీ. మధ్య వెండి కొండలా మెరుస్తూంది మేడ.

గోడ దూకటానికి మర్రిచెట్టు ఎక్కాడు. గుడ్లగూబ అరుచుకుంటూ లేచిపోయింది. చీకట్లో ఎగరలేని పక్షులు తమ స్థావరాల్లోనుంచే పెద్దగా అరుస్తున్నాయి. కొమ్మనుంచి పాకి అవతలికి దిగాడు.

లోపల నీరవ నిశ్శబ్దం. నౌకర్లుగాని, కుక్కగాని ఉన్న అలికిడి లేదు. ఒకవేళ ఉంటే ఏం చెయ్యాలో ఆలోచించుకుని మరీ వెళ్ళాడు.

గోడకి అవతలిప్రక్క మొగలి పొదలోంచి సన్నగా కీచురాళ్ళ సవ్వడి ఇంకా అరుస్తూ, అటూ, ఇటూ ఎగురుతూన్న గుడ్లగూబ శబ్దం తప్ప వేరే అలికిడి లేదు.

వెంటిలేటర్ నుంచి మేడమీదికి దిగాడు.

జగన్నాథం నిద్రపోతూ ఉండాలి. ఊరి జనం పచ్చి నెత్తురు తాగి దుర్మార్గుడు మత్తుగా నిద్రపోతూ ఉండాలి. నిద్దట్లో చంపకూడదు. తన్నెవరు చంపారో ఎట్లా తెలుస్తుంది? తన చేతుల్లో సర్వనాశనమైన భాస్కరం చేతిలోనే తను హతమారుతున్నట్లు తెలియాలి మానవుడికి.

గదులు వెతుక్కుంటూ పడకగది వైపు నడిచాడు. తలుపులు తెరిచే ఉన్నాయి. గదిలో సన్నని పచ్చటి పడక దీపం వెలుగుతూంది.

సన్నగా మాటలు వినబడుతున్నాయి. జగన్నాథం ఎవరినో దీనాతిదీనంగా వేడుకుంటున్నాడు.

"రావుడూ! నీకు దణ్ణం పెడతాను— వాణ్ణి చంపకురా."

"వాణ్ణేకాదు, బాబాయ్...ఆ తరవాత నీకూ తప్పదు."

"బాబూ, రావుడూ! చుట్టం చూపుగా వచ్చావు. నిన్నెంతో ఇదిగా ఆదరిస్తున్నాను. ఇది నీకు న్యాయమా, రావుడూ!"

"నీవు కూడా న్యాయం గురించి మాట్లాడుతున్నావా, బాబాయ్? భలే! ఆ ధర్మదేవత గతేం కామందో?"

"నిన్నెంతగా ప్రేమించి ఆదరించానో నీకు తెలీదా?"

"అబ్బో!! ఎందుకు తెలీదు. అందుకేగా మరి నన్ను దత్తత చేసుకోకుండా వాడెవణ్నో తెచ్చుకున్నావు! ఇప్పుడవన్నీ ఎందుకు గాని బాబాయ్, ఈ కాగితాల మీద సంతకాలు చెయ్యి."

"ఏమి టా కాగితాలు?"

"నీ ఆస్తి అంతా నాకు రాసినట్టు తయారుచేసిన కాగితాలు."

"వాణ్ణి దిక్కులేని వాణ్ణి చేస్తావా, రావుడూ?"

"ఎంతమందిని నువ్వు దిక్కులేని వాళ్ళని చెయ్యలేదు?"

'భలే, భలే మా టన్నాడు' అనుకున్నాడు భాస్కరం.

అంతలోనే ఛెళ్ళున కొరడా శబ్దమైంది. 'అమ్మా' అంటూ ఒక పిల్లవాడి కంఠం వినబడింది.

"రావుడూ ... నీ కాళ్ళట్టుకుంటాన్నాయనా! వాణ్ణేం చెయ్యకు ... తే, నాయనా, ఆ కాగితా లిలా తే ..."

అయిదు నిమిషాలు నిశ్శబ్దం.

"మమ్మల్నందరినీ మోసం చేసి సంపాయించావు కదూ, బాబాయ్! నీ ఆస్తంతా నీ వెంట వస్తుందేమో చూసుకో."

"అయితే, నన్ను చంపుతావా?"

"నిన్నే కాదు. నీ దత్త పుత్రుణ్ణి కూడా."

'చంపనీ దుర్మార్గుణ్ణి! కాగల పని గంధర్వులే చేస్తున్నారు' అనుకున్నాడు భాస్కరం.

పిల్లవాడి ఏడుపు ...

జగన్నాథం వేడికోలు ...

"బాబూ, రావుడూ! ఆస్తంతా నీకే రాశాను గదా, నాయనా? ఇంకెందుకు వాణ్ణలా హింసిస్తున్నావు? మమ్మల్ని బతకనియ్యి. రాత్రికి రాత్రే ఎక్కడికైనా వెళ్ళిపోతాం."

"అమ్మ! ఎంత మాట!! మీరు బతికిఉంటే ఈ పత్రాల్లో విలువేముంది, జగన్నాథం బాబాయ్?"

"మేం చస్తే మాత్రం హత్య చేశావనే నేరం ఎక్కడికి పోతుంది?"

"ఆ జాగ్రత్త లేనో నేను వచ్చాను గాని, ఇక టైమవుతోంది. ఇష్ట దైవాన్ని ప్రార్థించుకోండి. ముందు నీ ఎరువు కొడుకూ ... తర్వాత నువ్వూ ..."

క్షణం నిశ్శబ్దం. తర్వాత కెవ్వున అరిచిన పిల్లవాడి కంఠం.

భాస్కరం లోనికి తొంగి చూశాడు. మసక వెలుతురులో పిల్లవాడి ఛాతీ నుంచి అగ్నికణాల్లా నెత్తురు చిమ్ముతూంది. భాస్కరం మేను గగుర్పొడిచింది. అతనిలోని ప్రతీకారం పలాయనమై, నిద్రాణమై ఉన్న మానవత మేల్కొంది. ఒక్క ఉదుటున లోనికి దూకి జగన్నాథాన్ని పొడవబోతున్న రామనాథంపై దూకాడు.

ఇద్దరూ కలబడ్డారు.

రామనాథం చేతిలోని కత్తి భాస్కరం భుజంలో దిగింది. భాస్కరం కసిగా చేతిలోని కత్తి విసిరాడు. రామనాథం పొట్ట తెగి నేల కొరిగాడు.

పిల్లవాడి దగ్గరకు పరుగెత్తాడు భాస్కరం. అప్పటికే అతని నాడి ఆగిపోయింది.

జగన్నాథానికి ఇదంతా మాయగానో, కలగానో అనిపించింది.

భాస్కరం జగన్నాథం కట్లు విప్పుతూ, "మిమ్మల్ని చంపాలని వచ్చాను. జగన్నాథంగారూ! కాని, రక్షించవలసి వచ్చింది" అన్నాడు.

ఎన్నో కుత్తుకల్ని కత్తిరించిన కసాయివాడికి కూడా తాను పశ్చాత్తాపపడే ఘడియ వస్తుంది. అలాంటిదే కలిగింది జగన్నాథంలో.

"నాయనా, భాస్కరం! నీకు నేనెంతో అన్యాయం చేసిన మాట నిజమే. ఇప్పుడవన్నీ ఎందుకు, బాబూ! ముందు నా ప్రక్కన్నుంచి వెళ్ళిపో."

"నన్ను రక్షించుకోవాలని హితబోధ చేస్తున్నారా, జగన్నాథంగారూ! లాభం లేదు! నేను బయట ఉండి దిక్కులేని వాణ్ణిగా బతకలేను. వెళ్ళండి— పోలీసులకు ఫోన్ చెయ్యండి. నన్ను జైలుకు పంపించండి. ఉరి తీయించండి."

భాస్కరం చేతులు పట్టుకున్నాడు జగన్నాథం.

"అలా అనకు, బాబూ! నాలుగు కాలాల పాటు సుఖంగా బతకాల్సినవాడివి. నిరుత్సాహపడకు, బాబూ! జరిగిం దేదో జరిగిపోయింది. నీకు నే నున్నాను. వెళ్ళిపో, భాస్కరం."

భాస్కరం పారిపోలేదు. తనే పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పాడు.

• • •

భాస్కరానికి శిక్ష పడింది.

భాస్కరాన్ని కాపాడాలని జగన్నాథం చేసిన ప్రయత్నాలేవీ పారలేదు. అతణ్ణి రక్షించడంకోసమే రామనాథాన్ని చంపాడనే వాదన నిలవలేదు. అసలు రామనాథాన్ని భాస్కరం ఎందుకు చంపాడన్నది ప్రశ్న. కాదు. అంతరాత్రివేళ జగన్నాథం ఇంట్లో ఎందుకు ప్రవేశించాడన్నదే ప్రశ్న.

ఒకవేళ రామనాథం అక్కడ లేకుండా ఉంటే, భాస్కరమే జగన్నాథాన్ని చంపి ఉండేవాడు కదా?

ఇదీ తర్కం.

నేరస్థునిపై పరిస్థితుల ప్రభావాన్ని పరిశీలించలేని చట్టం ... దానినుంచి పుట్టిన న్యాయం ... శతాబ్దాల పుచ్చ న్యాయశాస్త్రం తర్కించే విధం ఇది.

అందుకే భాస్కరానికి శిక్ష పడింది.

భాస్కరంలోని మానవుడికి శిక్ష పడింది. ★

---

**ఉపేక్ష**

**ఉపేక్షించడాన్ని మించిన ఘోరమైన విమర్శ లేదు.**

—ఛార్లస్ బక్స్టన్